

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 37 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

చూస్తున్న ప్రజల హాహాకారాలతో కొండ దద్దరిల్లిపోయింది. కచ్చితంగా పడగకు కిందనుండి తెగి రెండుముక్కలయ్యింది ఆ మహాసర్పం. తోకభాగం బిలంలోనే వుండిపోవడంతో నెత్తుటిబుగ్గలా రక్తాన్ని చిమ్ముతూ బిలంలోకి జారిపోయింది మొండెం. నోటిలో వున్న అభాగ్యుడితో సహా తెరిచిన పడగ తెరిచినట్టే నేలకూలింది. వికృతంగా 'కీ' అని అరుస్తూ ఎగిరెగిరి పడింది పడగ. కోరల విషం వలన నల్లగా బొగ్గులా మాడిపోయాడు ఆ దురదృష్టవంతుడు. నల్లటి శిల మీద కుంకుమనీటితో అభిషేకించినట్లు నెత్తుటి మడుగులో నేలకు రాలిపోయాడు దాని కోరలమధ్యనుండి.

ఇంకా ప్రాణం వున్న పడగ ఐదు మూరల ఎత్తున ఎగిరిపడుతూ మూడు గంతులలో 'పడగ కొండ'ను సమీపించింది. నెత్తుటి తుంపరలు ఎగిరిపడుతుండగా 'హిస్సు'మని ధ్వని చేస్తూ పాతిక అడుగులకు పైనున్న కొండశిఖరం మీదకు ఎగిరింది. శిఖరం మీద వున్నవాళ్లు ఏమీ తోచని స్థితిలో తలా ఒక ప్రక్కకు దూకి తప్పుకునే ప్రయత్నం చేశారు. గాలి పటంలా మీదకు దూకుతున్న పడగ పైకి ఆయుధాలను ప్రయోగించే సమయం లేకుండా పోయింది. నమ్మశక్యం కాని సంఘటనకు వారి మెదళ్ళు మొద్దుబారిపోయాయి. అప్పుడు ప్రత్యక్షమయ్యాడు అంతవరకూ వారిని నడిపిస్తున్న వ్యక్తి.

కాషాయదుస్తులలో వున్నాడతను. ఋషిలా జుట్టు ముడివేసుకున్నాడు. కొప్పులో, దండచేతులకు, మెడలోని రుద్రాక్షలకు వెండి పడగలు ధరించివున్నాడు. నీలిరంగులో వున్న కనులతో, తీక్షణమైన చూపులతో యేదో జంకు కలిగించేలా వున్నాడు. అందరూ పక్కలకు దూకుతుంటే అతడు మెరుపులాగా ముందుకు దూకాడు. కనులు చిత్రంగా మెరుస్తుండగా పడే పడడంతోనే పడగను చేతిలోని బరిశెతో బలంగా నొక్కిపెట్టాడు కొండకు. స్పృహలో లేని ఆ యువతిమీదే అప్పటిదాకా దాని చూపు వున్నది. బలహీనంగా బుసకొడుతూ తలను అణిచివేస్తున్న వ్యక్తివైపు కసిగా చూసింది.

కొన్ని క్షణాలపాటు కదలడానికి బలహీనమైన ప్రయత్నం చేసింది పడగ. క్రమేపీ కదలికలు నెమ్మదించి చివరికి చలనరహితమై పోయింది. అతడినే చూస్తూ, విప్పిన పడగ విప్పినట్లు అలానే వుండగా ఆ పెనుసర్పం ప్రాణం విడిచింది. కదలికలు పూర్తిగా ఆగిపోయినా కొన్ని నిముషాలపాటు అలాగే దాని తలను కొండకు అదిమిపెట్టి వుంచాడతను. అప్పటికి తేరుకుని నెమ్మదిగా అతడిని సమీపించారు తలొకవైపూ చెదిరిపోయినవాళ్లు. సంభ్రమంతో గొణిగినట్లు యేదో అనపోయాడు వారిలో ఒకతను. భయంకరంగా వురిమినట్లుగా, కొండలు రాసుకున్నట్లుగా పెద్ద ధ్వనులు వినిపించాయి. కొండమొత్తం కంపించిపోయింది.

'పరుగెత్తండి! కొండ కూలిపోతున్నది!' అని అరుస్తూ యువతిని అవలీలగా భుజాలమీదకు ఎత్తుకున్నాడు అతను. చివాలున వెనుదిరిగి పడగశిఖరం మీదినుండి క్రిందకు పరుగులు తీశాడు. గొల్లున అరుస్తూ ఆ నలుగురు యువకులూ శిఖరంనుండి క్రిందకు పరుగులు పెట్టారు. భుజాలమీద యువతిని మోస్తూ సుడిగాలిలా అతను పరుగులు తీస్తూ పడగ ఆకృతిలో వున్న ఆ శిఖరాన్ని దిగాడు. అతడిని వెన్నంటి నలుగురు యువకులూ గంతులేస్తూ దిగారు. మరుక్షణం చెవులు బ్రద్దలయ్యేలా ఫెళ ఫెళమని ధ్వనులు చేస్తూ విరిగిపడింది పడగ ఆకృతిలో వున్న కొండశిఖరం. నెత్తిన మణితో విప్పుకున్న పడగలాగా చుట్టుపక్కల యాభై మైళ్లవరకూ వేలసంవత్సరాలుగా కనిపించిన శిఖరం కూలిపోయింది. చుట్టుపక్కల ఐదుమైళ్ళ వరకూ భూకంపం వచ్చినట్లు భూమి అదురింది. పదిమైళ్లవరకూ ధ్వనులతో దద్దరిల్లిపోయేలా కొండ కదిలిపోయింది. చిన్నా పెద్దా రాళ్ళూ రప్పలూ గాలిలోకి ఎగిరిపడ్డాయి. చిన్నచిన్న జంతువులు, పక్షులు రొదపెడుతూ తోచిన దిక్కుకు పారిపోయాయి. కొన్నిక్షణాలపాటు ఏమీ కనిపించకుండా దుమ్ము, ధూళి రేగి నెమ్మదిగా సద్దుమణిగింది.

పడగమీద మణిలాగా వున్న పెద్ద గండశిల దారికి అడ్డంవచ్చిన చిన్నాపెద్దా చెట్లను, పొదలను విరగదీస్తూ దిగువన లోయలోకి జారిపోయింది. అదృష్టవశాత్తూ కొండనెక్కటానికి వుపయోగించే వైపు కాకపోవడంతో పల్లె ప్రజలు బ్రతికిపోయారు. కొండవూగిపోతూ, ఫెళఫెళా ధ్వనులు రేగడంతో భయంతో అయోమయంగా చెట్లచాటుకు చాటుకు చేరుకున్నవాళ్ళు అందరూ భయంకరమైన నిశ్శబ్దం చోటుచేసుకోవడంతో నెమ్మదిగా చెట్లచాటునుండి బయటకు వచ్చారు. పడగశిఖరం మీదినుండి పరుగులుపెడుతూ అక్కడికే చేరుకున్నవారితో కలిసి విచిత్రమైన దృశ్యాన్ని చూశారు.

పడగవరకూ విరిగి క్రిందికి జారిన శిఖరం బిలంలోకి దిగబడిపోయింది. కంటికికనిపించని ఏదో మానవాతీతమైన శక్తి నేర్పుగా పేర్చినట్లు, అతికించినట్లు బిలం పైన రాతిపడగ నిలిచిపోయింది. మొదటిసారి ఆ స్థలాన్ని చూసేవాళ్లు ఎవరైనా ఎన్ని వందలు వేల సంవత్సరాలుగా ఆ రాతిపడగ అలా అక్కడ వున్నదో అనుకునేంత సహజంగా బిలంపైన పడగశిల వెలిసింది.

పడగశిఖరం కొండమీదినుండి క్రిందికి కూలిన మరుక్షణం ఆ యువతి యేదో మంత్రకట్టు విడిపోయినట్లు స్పృహలోకి వచ్చింది. ఇప్పుడా కనులలో యే మైకమూ లేదు. అప్పుడేవిచ్చుకున్న బొండుమల్లెల్లా తెల్లగా వున్నాయి. ఆమె మోహం యిప్పుడు పాలిపోయినట్లు లేదు. బుగ్గలు ఎర్రనెఱ్ఱనగా గులాబీ రేకుల్లా వున్నాయి. క్షణం క్రితం వరకూ ప్రళయం వచ్చినట్లున్న వాతావరణం ఆహ్లాదకరంగా మారిపోయింది. వీస్తున్న చల్లనిగాలికి ఆమె కొప్పువిచ్చుకుని నల్లని కురులు గాలికి ఎగురుతున్నాయి. ఆమె చేతితో కురులను సవరించుకోవడంతో ఆమెకు స్పృహ వచ్చిందని తెలుసుకున్నాడు ఆమెను భుజాలమీద మోస్తున్న వ్యక్తి.

క్రిందకు దించాడు నెమ్మదిగా.

అప్పుడు అర్థమైంది ఆమెకు, అప్పటిదాకా తను అతడి భుజాలమీద వున్నసంగతి. అతడి ముఖంలోకి చూసి అప్రయత్నంగా నాగుమయ్యా! అన్నది ఆశ్చర్యపడ్డట్లుగా. చిరునవ్వుతో తలపంకించి సమాధానమిచ్చాడు నాగుమయ్య. అతడి నీలికళ్ళు తమాషాగా మెరిశాయి. తల వూపినపుడు ముడివేసిన కొప్పులో, చెవులకు, మెడలో వ్రేళ్ళాడుతున్న వెండి పడగలు వూగాయి.

నాగుమయ్యకు జయజయ ధ్వానాలతో దద్దరిల్లిపోయింది కొండంతా. ఆనందంగా చిందులువేస్తూ అతడిని భుజాలమీదికి ఎత్తుకున్నారు నలుగురు యువకులు. బలహీనంగా వున్న ఆ యువతి ఆ అరుపులకు విస్తుబోతూ చుట్టూ కలయజూసింది. తానెక్కడున్నదీ అప్పుడు పూర్తిగా అర్థమయ్యింది ఆమెకు.

చుట్టూ భీతావహంగా వున్న కొండను చూసింది. పది అడుగుల ఎత్తున వున్న పడగశిలను చూసింది. భయంతో నిలువెల్లా వణికిపోతూ ఒక్కడుగు వెనక్కు వేయబోయి తూలింది. రక్తసిక్తమైన బొగ్గులామాడిన యువకుడి మృతశరీరాన్ని చూసింది. దూరంగా మాడిపోయిన ముగ్గురు పల్లీయుల శవాలను

చూసింది. కెవ్వున అరిచిన అరుపు పూర్తిగా బయటపడకముందే స్పృహతప్పింది ఆమెకు. సంపంగీ! అని ఆందోళనతో కేకలు పెడుతూ కొందరు ముందుకు ఉరికారు. నేలమీద పడకుండా అడ్డుకున్నారు. నాగుమయ్య కనుసైగతో ఆమెను భుజాలకెత్తుకుని ముందుకు నడిచాడు ఏనుగులా భారీగా వున్న వ్యక్తి ఒకడు. అందరూ కొండ దిగడం మొదలెట్టారు.

జరిగిన విచిత్రమైన సంఘటనల గురించి గోలగోలగా చెప్పుకుంటూ ముందుకు నడుస్తున్నారు కొందరు. ఆకులు కదిలినా, పొదలలో ఏ చిన్న సవ్వడి అయినా ఉలికిపడి పరస్పరం దగ్గరికి జరుగుతూ గబగబా ముందుకు నడుస్తున్నారు కొందరు. చేతిలోని బరిసెను వూపుకుంటూ ఆలోచనలలో మౌనంగా అడుగులేస్తున్నాడు నాగుమయ్య. అతని కనులముందు ప్రాణం విడుస్తూ తనమీదే చూపులు నిలిపిన పెద్ద పడగ మాటిమాటికీ కదులుతున్నది. గాలివాటుకు అతని భుజాలమీది ఉత్తరీయం తొలిగిపోయింది. విశాలమైన ఛాతీ మీద పడగవిప్పిన త్రాచును చిత్రించిన పచ్చబొట్టు నాలుకలు సాచి ఒళ్ళు జలదరించేలా కనిపిస్తున్నది. బొడ్డుచుట్టూ చుట్టలు చుట్టుకుని ఛాతీమీదకు వచ్చేప్పటికి పడగవిప్పిన త్రాచుబొమ్మ! చిత్రం! అతని వీపుమీద అదేవిధంగా పడగవిప్పిన త్రాచు పచ్చబొట్టు! నడివీపుమీద చుట్టలు చుట్టుకుని, వెన్నుపూస కొసకు ఆనేట్లు తోకను జారవిడిచి, విశాలమైన గూడలకు మెడకు తాకుతూ పడగ విప్పి నాలుకలు సాచిన త్రాచు బొమ్మ!

కొన్నిగంటలపాటు భయావహమైన వాతావరణానికి నెలవైన కొండమీద ప్రశాంతత నెలకొన్నది. కాలిబాటన కొండదిగి వస్తున్న పల్లె ప్రజలందరూ గడిచిన క్షణాలను మరిచి ఆనందంగా కబుర్లు చెప్పుకుంటూ కొండ దిగుతున్నారు. కళ్ళు పెద్దవిచేసి అంతవరకూ జరిగిన దృశ్యాలను అభినయిస్తూ మరల మరలా చెప్పుకుంటూ నడుస్తున్నారు కొందరు. పెద్ద పెద్ద చెట్లు కొమ్మలు వూపుతూ చల్లని గాలులు వీస్తూ సేద దీరుస్తున్నాయి. పక్షుల కూతలు పలకరిస్తున్నట్లుగా, కబుర్లకు బదులిస్తున్నట్లుగా చెలరేగుతున్నాయి. బెదిరిస్తున్నట్లుగా తోకలు లేపి, కోరలు కనిపించేట్లు నోళ్లు తెరిచి ముందుకు ఉరుకుతున్నట్లు వంగి చూస్తున్నాయి అడవికోతులు. భయంతో బిరబిరా పారిపోయి పొదలమాటునుండి తొంగిచూస్తున్న చెవుల పిల్లులను కాజెయ్యడానికి పొంచి చూస్తున్నాయి అడవిపిల్లులు. అడవి భయపెట్టే అందంతో జంకును కలిగిస్తుంది! నాగుమయ్యకు కొద్దిగా ఎడంగా నడుస్తున్న యువకుడొకడు ఉత్సాహంగా పాటనందుకున్నాడు. భుజాలమీదున్న పైవస్త్రాన్ని నడుముకు బిగించుకున్నాడు. చేతులతో దరువులా తాళం వేస్తూ రాగయుక్తంగా సాగదీస్తూ పాడసాగాడు.

ఆదీవారమునాడు ఆనందుడా అడలా గొట్టకుమయ్య ఆనందుడా
ఆహా ఆహా ఆహా ఆనందుడా అచ్చారాలనుచుట్టీ ఆనందుడా
ఆనందుడా ఏలి ఏలి విజయా విజయాయ సోహా ఆనందుడా
ఆదీవారమునాడు ఆనందుడా అడలాగొట్టకుమయ్య ఆనందుడా

సోమావారము సొగసూగాడా వాసూకీ సోయీ దిప్పకుమయ్య సోగ్గాడ వాసూకీ
వాసూకీ వాసూకీ వాసూకీ ఏలి ఏలీ విజయాయ సోహా వాసూకీ

మంగళ వారమునాడు తక్షాక కుత్తుక మీద లిలిలీ లిఖియించీ తక్షాక
తక్షాక తక్షాక ఏలి ఏలి విజయాయ సోహా ఫట్టూ సోహా

బిగ్గరగా నవ్వుతూ 'వూ! కానియ్య'మన్నట్టు తల ఎగరేశాడు నాగుమయ్య. పాటనందుకున్న యువకుడిని వీపు మీద చరిచి నాగుమయ్యకు రెండుచేతులెత్తి దండం పెట్టాడు అతని పక్కన నడుస్తున్న వృద్ధుడు. తన చేతిలోని బల్లాన్ని గాలిలోకి ఎగరేసి, తాను వంత పాడడం మొదలెట్టాడు.

యువకుడు మైమరిచి పాడడంలో మునిగిపోయాడు. అది నాగుమయ్య కట్టిన పాట. నాగపంచమినాడు మైమరచి పాడుతూ, అందరితో పాడించే పాట. 'బ్రహ్మ గారుడము' అనే ప్రాచీన శాస్త్రములో 'అష్టగారుడ ఫణి నిదానము' అనే బీజాక్షర మంత్రరహస్యాలను పాటరూపంలో నాగుమయ్య పాడించేపాట.

ఆదివారము మొదలుకొని, శుక్రవారము వరకూ ఆరు రోజులు మనుషులను, పశువులను కాటు అందుకునే ఆరు పేర్లున్న విషసర్పాలు వుంటాయిట. శనివారము పగటిపూట ఒకపేరున్న సర్పజాతి, రాత్రిపూట మరొకపేరున్న సర్పజాతి దయ, దాక్షిణ్యం లేకుండా కాటునందుకుంటాయట. మొత్తం ఎనిమిది పేర్లున్న పాములన్నమాట! వాటికివిరుగుడు చేసే విధానము అష్టగారుడ ఫణి నిదానము అనే మంత్ర శాస్త్రమట! వృద్ధుడు నాగుమయ్య ఆలోచనలలో మునిగిపోయాడు. మధ్య మధ్య తోడుగా గొంతు కలుపుతూనే గతంలోకి వెళ్ళిపోయాడు.

చుట్టుపక్కల యాభై కోసులదాకా ఎంత మొనగాడి నాగుపామైనా నాగుమయ్య పేరు పలికితే పడగ దించి తోకముడవాల్సిందే. ఎంత భయంకరమైన విషమైనా దిగిపోవాల్సిందే. ఉత్తిచేతులతో ఎంతెంత పెనుపాములను పట్టి లొంగదీసి, అడవిలో వదిలిపెట్టాడో కథలు కథలుగా చెప్పుకుంటారు 'పాండవుల గుట్ట' చుట్టుపక్కల యాభైమైళ్ళ ఊళ్ళల్లో. పాండవులగుట్టమీద పడగవిప్పిన పాములా కనిపించే శిఖరం మీద ప్రతీ నాగపంచమికీ నాగులసంబరాలు చేస్తాడు నాగుమయ్య. నాగుమయ్య కథ చాల విచిత్రమైనది.

పాండవులగుట్ట దిగి పదిమైళ్ళు నడిస్తే నాగవరప్పాడు గ్రామం. గ్రామపెద్ద, పెద్దదిక్కు, పూజారి, వైద్యుడు అన్నీ శంకర శాస్తుర్లు గారే గ్రామస్తులకు. పేరుకు తగ్గ భోళా శంకర శాస్త్రుల్లే ఆయన. వందల ఎకరాలు దానధర్మాలకు హరించుకుపోయి, తరతరాల అర్చకత్వం నడిపించడానికి శివాలయం మాత్రం మిగిలింది. కట్టుబట్టలకు, తినడానికి కటకటగా సరిపోయే స్థితి వచ్చినా ఆయన దానగుణం మానుకోలేదు. పెళ్ళైన పన్నెండేళ్లకు, ఆయన భార్య పార్వతమ్మ తొలిచూలు రోజుల్లో ఒక దిగంబర సాధువు ఉన్నట్టుండి ప్రత్యక్షమయ్యాడు ఎక్కడినుండో.

ఒంటినిండా బూడిద పూసుకుని వున్నాడు ఆ సాధువు. చేతిలో త్రిశూలం, పెద్ద సిగముడి చుట్టూ పిడికిలంత రుద్రాక్షలు, పాదాలదాకా వ్రేలాడుతున్న జుత్తు, ఒంటి మీద నూలుపోగు లేకుండా ఇంటిముందు ప్రత్యక్షమయ్యాడు. చేతిలో పెద్ద గుమ్మడికాయంత శంఖాన్ని వూదితే, పాండవులగుట్ట కూడా మారుమోగింది. అప్పుడే తినడానికి కూర్చున్నాడు శంకరశాస్తుర్లు. శంఖధ్వని వినగానే చివాలున లేచి వచ్చాడు బయటకు.

చేతిలోని మనిషి పుఱ్ఱెను ముందుకు సాచి 'మాతాన్నపూర్ణేశ్వరీ!' అని బిగ్గరగా పలికాడు దిగంబర సాధువు. ఆయన కాళ్ళు కడిగి నడవాలోకూర్చోబెట్టి తనవంతు భోజనాన్ని వడ్డించాడు. భార్యకు మిగిలిన దానిలో తానూ, భార్యా ఆ పూటకు సర్దుకుందామనుకున్నాడు. క్షణంలో వడ్డించినదాన్ని తినేసి యింకా కావాలన్నట్టు చూశాడు సాధువు. భార్యవంతు భోజనాన్నీ వడ్డించాడు శాస్తుర్లు. అదీ మాయమైంది క్షణాలలో. యింకా..అన్నట్టు చూశాడు సాధువు. పొరుగూరు భీమవరం నుండి పొద్దున్న వైద్యానికొచ్చిన వాళ్ళు అరటి గెల కొట్టించుకొచ్చారు. వద్దు వద్దన్నా దాన్ని వదిలి వెళ్లారు. అది గుర్తుకొచ్చింది శాస్తుర్లకు. గెలను బయటకు తెచ్చి పళ్ళు ఒలిచి యివ్వబోయాడు. గెలను లాక్కున్నాడు సాధువు. గెల మొత్తం ఖాళీ చేశాడు. ఒక్క పండును మాత్రం మిగిల్చాడు.

మిగిలిన ఒక్క అరటిపండునూ ఎంగిలిచేత్తోనే పట్టుకుని, యింటిలోపలికి చూస్తూ 'అన్నపూర్ణే' అని బిగ్గరగా అరిచాడు సాధువు. తన యిల్లాలిని బయటకు రమ్మంటున్నాడని అర్థమైంది శంకర శాస్త్రికి. లోనికివెళ్ళి పూర్ణగర్భవతి ఐన భార్యను చేయూతతో బయటకు తీసుకొచ్చాడు నెమ్మదిగా. ఫలభారంతో వంగిన పచ్చని కొమ్మలా వున్నది పార్వతమ్మ. సాధువు తనచేతిలోని అరటిపండును ఆమె చేతిలో పెట్టాడు. సంకోచించకుండా అందుకుని కళ్ళకద్దుకుంది ఆమె. ఎడమ అరచేతిలో కుడి మోచితిని పాము పడగలా వుంచి, ఆశీర్వదిస్తున్నట్లుగా విచిత్రంగా నవ్వాడు సాధువు. ఇక లోపలికి వెళ్లిపొమ్మని సైగ చేశాడు ఆమెకు. పార్వతమ్మ భర్త సహాయంతో లోపలికివెళ్ళిపోయింది నెమ్మదిగా.

భార్యను లోపలికి పంపించి వచ్చాడు శంకర శాస్తుర్లు. సాధువుకు సాగిలపడ్డాడు. అతని వెన్నుమీద చురుకు పుట్టేలా చరిచాడు సాధువు. తనకెదురుగా కూర్చోబెట్టుకున్నాడు. అప్పటిదాకా విచిత్రంగా ఉన్న సాధువు చూపులు, నవ్వులు, కదలికలు ఉన్నట్టుండి మారిపోయాయి. జంకు కలిగించే గాంభీర్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఒక దివ్యబీజాక్షర మంత్రం అతని నోటివెంట వెలువడింది. చేతులు జోడించి ఆయన పలికినట్లే పలికాడు శంకరశాస్తుర్లు. సాధువును మరలా చూడాలనే కుతూహలంతో సింహద్వారం వద్దకు చేరుకొని, తలుపుల మాటునుండి శ్రద్ధగా వింటున్న పార్వతమ్మను

సాధువు, శంకర శాస్తుర్లూ గమనించలేదు. మంత్రాన్ని పన్నెండుమార్లు వల్లెవేయించాడు సాధువు. లోగొంతుకతో చెబుతున్నా స్పష్టంగా వినిపిస్తున్న మంత్రాన్ని కనులు మూసుకుని శ్రద్ధగా విన్నది పార్వతమ్మ. అప్రయత్నంగా మననం చేసింది.

కనులు మూసుకుని చేతులు జోడించి వల్లెవేస్తున్నాడు శంకరశాస్త్రి. తన బొడ్లోనుండి పెద్ద నిమ్మకాయంత గుండ్రని వస్తువునేదో తీశాడు సాధువు. శంకరశాస్త్రి చేతులలో వుంచాడు. 'నాగమణి' అని మూడుసార్లు అన్నాడు. కనులు తెరిచిన శంకరశాస్త్రికి సాధువు కనిపించలేదు. ఎటువైపు, ఎలా వెళ్లిపోయాడో అంతుపట్టలేదు. తన అరచేతులలో మెరుస్తున్న నాగమణిని ఆశ్చర్యంగా చూశాడు శంకరశాస్త్రి. సింహద్వారం వెనుక బాధతో మూలిగిన ధ్వని వినిపించి చివాలున లేచి లోపలకు వెళ్ళాడు. తలుపుల వెనుక గడమంచె మీద కడుపును చేతితో అదుముకుంటూ మెలికలు తిరుగుతున్న భార్యకనిపించింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS